అమ్మఒడి మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

త్యాగాలకు ప్రతీక బక్రీద్

నేడు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఖుర్బానీ ఇవ్వనున్న ముస్లిములు

ప్రజాశక్తి-అనంతపురం, ఆత్మకూరు

త్యాగానికి ప్రతీకగా అయిన బక్రీద్ పండుగను ముస్లిములు గురువారం జరుపుకోనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఈద్గాలను ప్రార్థనల నిమిత్తం అన్ని వసతులతో సిద్ధం చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగను పురస్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలసిమెలసి చేసుకోవాలని ఆకాంక్షించారు.

బక్రీద్‌కు ప్రత్యేకం ఖుర్బానీ

బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే మూగజీవి.. ఈద్ అంటే పండుగ అని అర్థం. బక్రీద్ పండుగకు ఖుర్బానీని ప్రత్యేకంగా చెప్పవచ్చు. దీనికి ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. తమ ప్రియమైన వస్తువులను త్యాగం చేయమని దేవుడు చెప్పినట్లు భావించి అబ్రహం(ఇబ్రహీం) తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి చేసేందుకు సిద్ధపడతాడు. ఆయన త్యాగానికి మెచ్చిన అల్లాహ్ కుమారుని ప్రాణత్యాగానికి బదులు ఓ మూగ జీవాన్ని బలి ఇవ్వాలని చెబుతాడు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ రోజున ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. బలి ఇచ్చిన మూగజీవాలను మూడు భాగాలుగా చేసి.. అందులో ఓ వంతు పేద ప్రజలకు, రెండో వంతు తమ చుట్టాలకు, మూడో వంతు భాగాన్ని తమ కుటుంబం కోసం వాడుకుంటారు. అందుకే బక్రీద్ పండుగ రోజున ముస్లిలందరూ ఖుర్బానీ ఇస్తారు.

తమ్ముళ్లకు పిలుపు

◆ వివాదాలపై అధిష్టానం సీరియస్

◆ రచ్చపై అమరావతిలో పంచాయితీ

◆ భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర నిర్వహణపైనా అసహనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర కాస్త టిడిపి నాయకుల మధ్య విభేదాల యాత్రగా కొనసాగుతోంది. వరుసగా జిల్లాలో కొనసాగుతున్న వివాదాలపై టిడిపి అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. గొడవులు జరుగుతున్న నియోజకవర్గాల్లోని నేతలను త్వరలో అమరావతికి పిలిపించనున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23వ తేదీన భవిష్యత్తుకు బస్సుయాత్ర ప్రారంభమైంది. ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని నియోజకవర్గాల్లో పార్టీలోని అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో విభేదాలు అధికంగానున్నాయి. పెనుకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో బస్సుయాత్ర పూర్తయ్యింది. ఈరెండు చోట్ల కూడా నాయకులు బాహాటంగానే ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర నాయుడులు రెండు గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. జిల్లా నేతల ముందే ఇవి జరుగుతున్నా వాటిని ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నంగాని, నిలువరించే చర్యలుగాని చేపట్టలేకపోయారు. దీనిపైనా అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. జిల్లా ముఖ్య నేతలకు ఫోన్ చేసి అధినాయకుడు క్లాస్ పీకినట్టు తెలుస్తోంది. ఇక మడకశిర నియోజకవర్గంలో బస్సుయాత్రనే రద్దు చేశారు. ఇక శింగనమల నియోజకవర్గంలో ఇంకా యాత్ర జరగాల్సి ఉంది. ఇక్కడ ఏమి జరుగుతుందోనని చర్చ ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. అంతకుమునుపు లోకేశ్ పాదయాత్ర సమయంలోనే నాయకుల మధ్య విభేదాలు పొడచూపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ యాత్రలో ఏమి జరుగుతుందోనన్న గుబులు ఆ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇలా విభేదాలు రచ్చకెక్కుతుండటంతో అధిష్టానం దృష్టి సారించింది. ఈ నియోజకవర్గాల్లోని నాయకులతోపాటు, ముఖ్య నాయకులతో వచ్చే వారంలో ప్రత్యేకమైన సమావేశం ఏర్పాటు చేసింది. విభేదాలతో రచ్చకెక్కుతున్న నేతలకు ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి అధినాయకుడు చంద్రబాబునాయుడు క్లాస్ పీకనున్నట్టు సమాచారం. పార్టీ ప్రతిపక్షంలో ఉండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నేతల తీరులో మార్పు రాకపోవడంపై ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఇదివరకే అనేక మార్లు నేతలకు సర్దిజెప్పే ప్రయత్నాలు చేసినా ఫలితం

లేకపోవడంతో ఈసారి జరిగే సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు చేస్తారన్నది పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నియోజకవర్గాల్లో ఈ రకమైన పరిస్థితి ఉంటే జిల్లా నేతలు ఏమి చేస్తున్నారన్న దానిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ అధిష్టానం నుంచి ముఖ్య నేతలకు అక్షింతలు పడినట్టు సమాచారం. ఎన్నికలు కొన్ని నెలల్లో ఉన్న సమయంలో ఇప్పటికైనా అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాల్సిన సమయంలో ఇదేతీరున కొనసాగడం పార్టీ క్షేత్ర స్థాయి నేతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించి వీటిని ఫుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో నష్టం జరుగుతుందని భావిస్తున్నారు.

2,13,394 మందికి అమ్మఒడి సాయం

తల్లుల ఖాతాల్లో రూ.277.41 కోట్లు జమ

ప్రజాశక్తి-అనంతపురం

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అమ్మఒడి కింద అనంతపురం జిల్లాలో 2,13,394 మంది తల్లుల ఖాతాల్లోకి సుమారు రూ.277.41 కోట్ల నగదును ప్రభుత్వం జమ చేసింది. 4వ విడత జగనన్న అమ్మఒడి జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నగరంలోని కెఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాయదుర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జెడ్పీ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం.ఉమాదేవి, ఎడిసిసి ఛైర్మన్ లిఖిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విద్యకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. పేదరికంతో విద్యకు ఎవరూ దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మఒడి ద్వారా ప్రతి ఏడాది తల్లుల ఖాతాల్లో రూ.15వేలను రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోందని చెప్పారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులు అమ్మఒడి మెగా చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, శంకర ప్రసాద్, డిఈవిఒ వెంకటరమణ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిమాపక రక్షణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఉన్న అగ్నిమాపక సేవా సిబ్బంది సమన్వయంతో పనిచేసి అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వం ద్వారా రూ.15 లక్షల వ్యయంతో మంజూరైన 199 వివిధ విపత్తుల నివారణకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక సేవా సిబ్బంది, రక్షణ, పునరావస కార్యక్రమాల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వివిధ రకాల అగ్ని ప్రమాదాలు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజల్లో విస్తతంగా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డిని సూచించారు. విపత్తు సమయాల్లో అప్రమత్తంగా ఉండి జరిగే నష్టాలను నియంత్రించే విధంగా ప్రస్తుత పరికరాలను ఉపయోగించాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ అన్ని విధాల సంసిద్ధులై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కెపి.లింగమయ్య, ఇతర అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై మోయలేని భారాలు

◆పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు తగ్గించాలి ◆ఐద్వా, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

టవర్‌క్లాక్ వద్ద మెడలో కూరగాయల దండను వేసుకుని నిరసన తెలుపుతున్న సిపిఎం, ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడంతో పేదలపై మోయలేని భారాలు పడుతున్నాయని, తక్షణం ఈ ధరలను తగ్గించాలని సిపిఎం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాలు, కూరగాయలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం నాడు అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కూరగాయలు మెడలో తగిలించుకుని, పళ్లెంలో టమోటాలు, మిరపకాయలు, ఇతర కూరగాయలను వేసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఏమి కొనాలన్నా రూ.100కు పైగానే ఉన్నాయన్నారు. టమోటా, మిరపకాయలు కిలో వంద రూపాయలు ఉండడంతో పేద మధ్య తరగతి ప్రజలు వాటిని కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. ఒక పక్క గ్యాస్, విద్యుత్ ఛార్జీల ధరలు పెరిగిన సతమతం అవుతున్న ప్రజలపై నిత్యావసరాల భారాలు మరింత నడ్డివిరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలను తగ్గించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ కూరగాయల సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం ప్రజలపై మాత్రం అధిక ధరల భారం పడుతున్నా చేష్టలుడిగి చూస్తోందన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అయ్యాన్నారు. దళారి వ్యవస్థ ప్రజలు, రైతులను దోపిడీ చేస్తున్నా పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం మొద్దు నిద్రవీడి పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, నగర కమిటీ నాయకులు ప్రకాష్, వలీ, మసూద్, లక్ష్మీనరసమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకులు ఎన్టీఆర్ శీనా పాల్గొన్నారు.

రాయదుర్గంలో నిర్వహించిన బస్సుయాత్ర బహిరంగ సభలో పాల్గొన్న టిడిపి నాయకులు

జగన్‌కు ఆదాయం.. జనంకు అప్పలు..!

వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం

ఆ పార్టీకి మరో ఛాన్స్ ఇవ్వొద్దు

బస్సుయాత్రలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదాయం అంతకంతకూ పెరగ్గా, జనం నెత్తిన మాత్రం అప్పుల భారం పడిందని టిడిపి నాయకులు విమర్శించారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర బుధవారం నాడు రాయదుర్గంలో కొనసాగింది. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీమంత్రులు పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి వినాయక కూడలి వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎప్రికల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు జరిపిన అనంతరం మల్లాపురం లేఅవుట్ వద్ద గల టిడ్కో ఇళ్లను పరిశీలించారు. టిడ్కో గృహాల వద్ద సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం వినాయక కూడలిలో జరిగిన బహిరంగ సభలో పార్టీ నాయకులు ప్రసంగించారు. వైసిపి ఒక్క ఛాన్స్ పేరుతో అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అధోగతి పాలుజేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్మోహన్‌రెడ్డి కుటుంబం బాగుపడింది గానీ, ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. సొంత తల్లీ, చెల్లిని చూడలేని వ్యక్తి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ఏం చూస్తాడని నిలదీశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ పాలన మళ్లీ రావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే పాలన లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం మాజీ శాసనసభ్యులు హనుమంతరాయ చౌదరి, శాసనమండలి సభ్యులు బిటి.నాయుడు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి, పార్టీ నాయకులు కోట్ల సుజాతమ్మ, అనంతపురం మాజీ మేయర్ మదమంచి స్వరూప, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరితో పాటు రాయదుర్గం నియోజకవర్గంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తగ్గుపర్తిలో 'గడప గడపకూ మనప్రభుత్వం'

బెలుగుప్ప : మండల పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా వైసిపి నాయకులు విశ్వకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విశ్వ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు.

'అమ్మ డెయిరీ' ద్వారా కల్తీలేని పాలవిక్రయం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పది వేలమంది అమ్మల ఆధ్వర్యంలో నడిచే 'అమ్మ సహకార డెయిరీ' ద్వారా కల్తీలేని పాలను అందిస్తున్నారని, వీటిని ప్రతి కుటుంబం కొనుగోలు చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం నాడు అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ, పాపంపేట సచివాలయాల పరిధిలోని డ్వాక్రా సంఘాల లీడర్లు, మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారితే లక్ష్యంగా అమ్మ డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. ఈ డెయిరీ నుంచి జూలై 1వ తేదీ నుంచి పాలను సేకరిస్తారని చెప్పారు. రూపాయి తక్కువ ధరకే నాణ్యమైన పాలను ఇంటికి చేరుస్తారన్నారు. అమ్మ డెయిరీ ద్వారా పాడి రైతులకూ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. మహిళా రైతులకు మంచి చేస్తూ, ప్రజలకు నాణ్యమైన పాలను అందివ్వడమే అమ్మ డెయిరీ లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న జి.ఓబులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర వ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో పని చేస్తున్న అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. బుధవారం నాడు రాయదుర్గం ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, వర్కర్ల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి జూలై 10,11వ తేదీల్లో అనంతపురం కలెక్టరేట్ ముందు రెండు రోజులపాటు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్క అంగన్వాడీ వర్కర్, హెల్పర్ మినీ వర్కర్లు అందరూ పాల్గొనాలన్నారు. పోరాటం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోగలమని చెప్పారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిడిపిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు మేరీ, బేబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో ఉరవకొండ డివిజన్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, తదితర సమస్యల పరిష్కారం కోసం జూలై 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లను కుదించడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. జీతాలు పెంచ కుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. పర్యవేక్షణ పేరుతో అధికారులు, రాజకీయ నాయకులు చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. మెనూ ఛార్జీలు పెంచి ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాల న్నారు. పెండింగ్ టిఎ బిల్లులు ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి బీమా అమలు చేయాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు అమ్మబడి అమలు చేయడంతో పాటు యూనిఫారం సరఫరా చేసి సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. టంగుటూరులో హత్యకు గురైన అనుసూయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు రంగారెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు అశ్వర్థమ్మ, ధనలక్ష్మి, నాగలక్ష్మి, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇసురాళ్లపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం సర్పంచి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ నైరుతిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ పాటుపడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి మరోసారి వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపిటిసి చిన్న వీరన్న, నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, కె.మధుసూదన్‌రెడ్డి, బేడల వెంకట్రాముడు, వై.సుభాష్‌రెడ్డి, మల్లయ్యయాదవ్, రంగయ్య, రాజన్న, గురుప్రసాద్, పుల్లారెడ్డి, శేషారెడ్డి, రాముయాదవ్, లాలునాయక్, హనుమంతు, చంద్ర, మల్లికార్జున, కౌన్సిలర్లు వరదరాజులు, ఫారుక్, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

తాగునీటి సమస్యపై సమీక్షిస్తున్న ఛైర్‌పర్సన్ శిల్ప

తాగునీటి సమస్యపై సమీక్ష

రాయదుర్గం : పట్టణంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.శిల్ప ఇంజనీర్ సురేష్‌కు సూచించారు. ఆమె బుధవారం తన ఛాంబర్‌లో తాగునీటి పరిస్థితిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి పథకానికి సంబంధించి స్టాండ్ బై మోటార్లు, స్టాండ్ బై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వార్డుల్లో సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌ను కోరారు.

అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటనారాయణ

అనంతపురం : రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటనారాయణ బుధవారం సబ్ రిజిస్ట్రార్ యూనస్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈయన గతంలో బుక్కపట్నం, కడప, కర్నూలు, తదితర ప్రాంతాల్లో గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు. యూనస్‌ను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా నియమించారు.

బిఎఆర్‌సిలో ట్రైనీ సైంటిస్టుగా తిమ్మాపురం విద్యార్థి

భరత్‌కుమార్‌రెడ్డి

పుట్లూరు : మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన సంగటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు సంగటి భరత్‌కుమార్‌రెడ్డి బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బిఎఆర్‌సి)లో ట్రైనీ సైంటిస్టుగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ట్రైనీ సైంటిస్ట్‌గా దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు నీలం రమేష్‌రెడ్డి సంస్మరణ సభ

అనంతపురం : నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఎందరో ఆదరాభిమానాలు చూరగొన్న నీలం రమేష్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం(నేడు) ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాలులో సంస్మరణ సభ ఏర్పాటు చేస్తున్నారు. అందులో పూర్వ విద్యార్థులు, ఆయన అభిమానులు హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు (పూర్వ విద్యార్థులు) కోరారు.

30న సర్వసభ్య సమావేశం

కళ్యాణదుర్గం : ఈనెల 30వ తేదీ మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. అందులో మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం గేట్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో సిపిఆర్(గుండె పున:నిర్మాణం)పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెపోటుకు గురైన వారికి సిపిఆర్ చేయడం (ప్రథమ చికిత్స) విద్యార్థులు చేసి చూపించారు. ఈ మెలకువ ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి ప్రాణాలను ఎలా కాపాడాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాన్, ఉపాధ్యాయులు రఘు, నాగరాజు, గేట్స్ ఎన్ఎస్ఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల మహాధర్నా గోడపత్రికలు ఆవిష్కరణ

డి.హీరేహాల్ : రైతుల సమస్యలపై ఏపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ విజయవాడలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం సభ్యులు మల్లికార్జున కోరారు. ఈ మేరకు డి.హీరేహాల్‌లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రాయలసీమలో వెనుకబడిన జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని, 2022లో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా విడుదల చేయాలని, వ్యవసాయ ఓటర్లకు మీటర్లు బిగించే పద్ధతిని నిలుపుదల చేయాలని, ఉచిత విద్యుత పథకాలన్ని యథావిధిగా కొనసాగించాలని, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, తదితర రైతు సమస్య పరిష్కారానికి మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బసిరెడ్డి, ఈశ్వర్‌గౌడ, సుధాకర్, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రైతు సంఘం కమిటీ నాయకులు

సంస్కరణల పేరుతో విద్యుత్ రంగం నిర్వీర్యం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

సంస్కరణల పేరుతో కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున ధ్వజమెత్తారు. ఆయన బుధవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమంలో ప్రజలందరూ భాగ్యస్వాములు కాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం ఏ మేరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామంటున్న జగన్ ప్రభుత్వం వాటి వల్ల ఎవరికి ప్రయోజనమో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదలపై ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు నోరు మెదపకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. నాలుగేళ్లలో విద్యుత్ ఛార్జీల పెంపు పేరుతో రూ. 25 వేల కోట్లను ప్రజలపై భారం మోపారన్నారు. ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి వారిపై మరింత భారం మోపడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రజలపై జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా సామాన్య ప్రజలు, రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజాసంఘాలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

'అమ్మఒడి ' విడుదలపై సంబరాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేశారని మండల కో ఆప్షన్ మెంబర్ పామిడి సలీం, ఎం.జిలాన్‌బాషా తెలిపారు. సీఎం జగన్ 'అమ్మఒడి' పథకానికి నిధులు విడుదల చేయడంతో బుధవారం స్థానిక ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైసిపి విద్యార్థి సంఘం నాయకులు తేజ, దేవా, ఆసిఫ్, పవన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్ ఎం.ఇంతియాజ్‌బాషా, వైసిపి మైనార్టీ నాయకులు అన్వర్, ఎం. రఫిక్‌ఖాదర్, వైసిపి విద్యార్థి విభాగం నాయకులు బాబ్‌జాన్, కిరణ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్పల : 'అమ్మఒడి' పథకానికి నిధులు విడుదల చేయడంపై బుధవారం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంగీతకుమారి మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల కోసం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్‌పర్సన్ రమాదేవి, వైస్ ఛైర్మన్ ఆదినారాయణ, కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండలో అమ్మఒడి విడుదలపై సంబరాలు చేస్తున్న దశ్యం

ఆత్మకూరు : 'అమ్మఒడి' పథకం ద్వారా విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి హేమలత, ఎంపిడిఒ విజయ్‌ప్రసాద్, తహశీల్దార్ షర్మిల, ఎంఇఒ నరసింహారెడ్డి, కెజిబివి ఎస్ఒ నీలిమ, ఎపిఒ సుజాత, జి.కొండారెడ్డి, అతికిరెడ్డి, వన్నూరప్ప, ఆంజనేయులు, వెంకటేష్, ఎంపిటిసిలు, సర్పంచిలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేస్తున్న మేయర్ వసీం

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్ రెడ్డి కొనియాడారు. నగరంలోని పారిశుధ్య కార్మికులకు బుధవారం మేయర్ చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె, ఆప్రాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన పరికరాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. కార్మికులు నిత్యం పని ఒత్తిడితో పాటు పరిశుభ్రత నిర్వహణ తో అనారోగ్యం బారిన పడుతుంటారన్నారు. ఈ నేపథ్యంలో వారి ఆరోగ్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఇటీవల ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అందులో కొందరు కార్మికులు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, శ్రీనివాసులు, ఇషాక్, ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

నింబగల్లు ఆర్‌బికెలో మాట్లాడుతున్న ఎఒ శుభకర్

మండల పరిధిలోని నింబగల్, వెలిగొండ రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఎఒ శుభకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ శాఖకు సంబంధించిన పథకాలను రైతులకు అందించే విధి విధానాలపై సిబ్బందికి సూచనలు చేశారు. రైతులకు ఆర్‌బికెల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మండలంలో పిఎం కిసాన్ ఈకెవైసి చేయించుకోని వారు 1,350మంది ఉన్నారని, వారు ఆర్‌బికెలకు వెళ్లి ఈ నెల 30 లోపు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు చిరు ధాన్యాలను సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని రైతులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని, వీలైనంత మేరకు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట నింబగల్, వెలిగొండ వ్యవసాయ శాఖ సిబ్బంది హేమ, శ్రీలీల, రైతులు ఉన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వసతి గృహం ముందు ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌యు నాయకులు

ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎఎస్‌డబ్ల్యూఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, గుంతకల్లు సంక్షేమ వసతి గృహాల్లో బాత్‌రూంలు, టాయ్‌లెట్స్ శిథిలమైపోయాయని, లైట్లు, ఫ్యాన్లు పని చేయడం లేదన్నారు. వసతి గృహాల్లో వెంటనే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో సమస్యలు పరిష్కరించేంత వరకూ ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖాజా, వినోద్, శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'పిఎం కిసాన్'కు రెండు రోజులే గడువు : ఎడిఎ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ రవి

'పిఎం కిసాన్' లబ్ధిదారులు రెండు రోజుల్లోపు రైతు భరోసా కేంద్రంలో వేలిముద్రలు(ఫేసియల్ యాప్ ద్వారా) వేయాలని ఎడిఎ రవి సూచించారు. ఎడిఎ బుధవారం మండల పరిధిలోని రోటరీపురం ఆర్‌బికెని సందర్శించి రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటికీ 1,458 మంది రైతులు వేలిముద్రలు వేయలేదన్నారు. అలాగే రైతులందరూ మట్టి పరీక్షలు చేయించుకొని, ఫలితాలను బట్టి ఎరువులు వాడాలని సూచించారు. కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాన్ని తమ గ్రామ పరిపాలన అధికారి వద్ద తీసుకోవాలని, తద్వారా పంట నష్ట పరిహారం, రైతు భరోసా పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా రైతుల పొటాష్ కావాలని కోరగా రెండు రోజుల్లో ఆర్‌బికెకు సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు రాగి, కొర్ర, సజ్జ, జొన్న పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆయన వెంట ఎఒ శ్యాంసుందర్‌రెడ్డి, ఆత్మ బ్లాక్ మేనేజర్ అనురాధ, ఆర్‌బికె ఇన్‌ఛార్జి జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మల్లన్న, మాజీ ఉప సర్పంచి నాగ, రైతులు ఉన్నారు.

ముస్లిములకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బక్రీద్ శుభాకాంక్షలు

అనంతపురం : బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. గురువారం బక్రీద్ నేపథ్యంలో వారు ముస్లిములకు శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం వేర్వేరుగా ప్రకటన విడుదల చేరు. ఈ పండుగ త్యాగనిరతికి ప్రతీక అని, ఇతరుల పట్ల ప్రతి ఒక్కరూ సోదరభావం చూపాలన్నారు. ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

ప్రమాదకరస్థితిలో విద్యుత్ స్తంభం

ప్రమాదకరస్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం

ఆత్మకూరు : ఆత్మకూరుకు సమీపంలోని ఆవుల కొండారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తోటల మధ్యలో 11 కె.వి విద్యుత్ స్తంభం సిమెంట్ ఊడిపోయి ఇనుప కడ్డీలపై ఆధారపడి ప్రమాదకరస్థితిలో ఉంది. దీంతో ఆ తోట సమీపంలోని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించి నా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో విద్యుత్ స్తంభం విరిగి వైర్లు కింద పడడంతో ఓ రైతు మృతి చెందిన విషయం తెలిసిందే. అలాంటి మరో ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై స్తంభం మార్చాలని చుట్టుపక్కల రైతులు కోరుతున్నారు.

నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాగర్

నేరాల నియంత్రణపై అవగాహన

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడు గ్రామం ఎస్సీ కాలనీలో బుధవారం గార్లదిన్నె ఎస్ఐ సాగర్ సిబ్బందితో కలిసి చైన్ స్నాచింగ్, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, తదితర వాటిపై ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అలాగే సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న నేరాల గురించి, నేరాలపై వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. మహిళలకు సమస్యలు, ఇబ్బందులు ఉంటే 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత గురించి వివరించారు.

బ్యాంకర్లతో సమావేశం

అనంతపురం కార్పొరేషన్: 'ప్రధానమంత్రి స్వనిధి యోజన' పథకం ద్వారా నగరంలో అమలవుతున్న కార్యక్రమాలపై బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ జి.రమణారెడ్డి అధ్యక్షతన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. నగరంలో వీధుల్లో వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి ఈ పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించడంతో పాటు జీవిత బీమా సాకర్యం కల్పిస్తామని మెప్మా ప్రాజెక్ట్ బ్యాంకింగ్ కోఆర్డినేటర్ సి.కాట మయ్య తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, ఎపిజిబి మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫీసర్ పి.తస్లీం, శ్రీనివాస రెడ్డి, వీధి విక్రయదారులు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పట్టణ సమాఖ్య పాలకవర్గ సభ్యులు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పరిశీలన

ఆత్మకూరు : మండల పరిధిలోని బి.యాలేరు, సనప గ్రామ సచివాలయంలో బుధవారం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్దకు వెళ్లి 'జగనన్న సురక్ష' ద్వారా ఉచితంగా 11 రకాలు సేవలు అందజేస్తారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించే సేవలను తెలియజేసి ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్పంచిలు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి- బొమ్మనహాల్



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

బొమ్మనహాల్ రెవెన్యూ పరిధిలోని రైతులు రీసర్వే కార్యక్రమానికి సహకరించాలని తహశీల్దార్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక సచివాలయంలో బుధవారం రీసర్వేపై తహశీల్దార్‌తో పాటు స్పెషల్ ఆఫీసర్ సుజాత రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర ఆయకట్టు, దేవదాయ శాఖ, అసైన్‌మెంట్ భూముల హద్దులను గుర్తించడానికి వచ్చే అధికారులకు సహకరించి మీ భూముల హద్దులను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. బ్రిటీష్ పాలనలో నిర్వహించిన సర్వే, ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో కొన్ని మార్పులు చేర్పులు జరిగి ఉండవచ్చని, అందుకు రైతులందరూ సహకరిస్తే సర్వే సునాయసంగా ముందుకువెళ్తుందన్నారు. భూములు ఉండి కౌలుకిచ్చే రైతులు తప్పనిసరిగా వారికి కౌలు కార్డు మంజూరయ్యేలా సహకరించాలన్నారు. సమావేశంలో సర్వేయర్ రవితేజ, విఆర్ఓ తిమ్మప్ప, రైతులు మోహన్ బాబు, బసవరాజు, పయ్యావుల సత్యనారాయణ, అనిల్‌కుమార్, గొల్ల సూరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

సిడిపిఒ ప్రసన్నలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీల సమ్యల పరిష్కారం కోసం జూలై 10, 11 తేదీల్లో అనంతపురం కలెక్టరేట్ వద్ద చేపట్టే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి సిడిపిఒ ప్రసన్నలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను మరచిపోయారన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దీంతో అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయడానికి సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెటక్టు కార్యదర్శిపాతక్క, లీడర్లు గోవిందమ్మ, వరలక్ష్మి, తులిసి, దేవమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలోని బాలాజీ లాడ్జి ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ భార్యతో కలిసి గుత్తికి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. బైక్‌ను రహదారి పక్కన పార్కు చేసి రోడ్డు దాటుతుండగా గాంధీ విగ్రహం వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా పడ్డ వెంకటేష్‌ను ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసిపి కార్యకర్తకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

రహిమాన్‌రూ. లక్ష చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

గుత్తి : వైసిపి కోసం పాటుపడిన ఓ కార్యకర్తకు బుధవారం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి గుంతకల్లు పట్టణంలోని తన కార్యాలయంలో రూ. లక్ష చెక్కును అందజేశారు. గుత్తి మండల పరిధిలోని పాత కొత్తపేట గ్రామానికి చెందిన వైసిపి క్రియాశీలక కార్యకర్త అబ్దుల్ రహిమాన్ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి పాటుపడ్డాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఆ గ్రామ సర్పంచి ఆర్.గురుమస్తాన్ అతడి కుటుంబ పరిస్థితిని వివరించాడు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రహిమాన్‌కు రూ. లక్ష చెక్కు అందజేశారు.

హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు సత్కారం

రాయదుర్గం : పట్టణానికి వచ్చిన హిందూపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజను బుధవారం రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.శిల్ప మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం తన ఛాంబర్‌లో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లావణ్య, శారద, నాగవేణి, శ్రీనివాస్‌రెడ్డి, దేవరాజు, శివకుమార్, కోఆప్షన్ మెంబెర్స్ నజీర్, కె.శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జి శివ, శ్రీరామ్‌రెడ్డి, కృష్ణమూర్తి, నిజాముద్దీన్, గంగాధర్, రామాంజనేయులు, దివాకర్ , తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ : మండల కేంద్రమైన విడపనకల్లులో బుధవారం ఎంపిపి కరణం పుష్పావతి భీమ్ రెడ్డి స్థానిక వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో వికలాంగుల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సహకారంతో 5 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారన్నారు. ఈ సందర్భంగా విడపనకల్లు వికలాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ సంఘం సభ్యులందరూ వైసిపి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, దేశాయి సిద్ధార్థ, హంపయ్య, ఉమాశంకర్, లాలెప్ప, సంఘం సభ్యులు వన్నూర్‌బీ, ప్రకాష్, రసూల్, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనఅధినేత పవన్‌కల్యాణ్‌పై విమర్శలు తగదు

ఉరవకొండ : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌పై మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ కుమార్ తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారాహియాత్రకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వారు విమర్శలు చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్ ప్రజల డైరెక్షన్‌లో నడిచే నాయకుడని, మీ నాయకునిలాగా ఐ ప్యాక్ డైరెక్షన్‌లో నడిచే వ్యక్తి కాదన్నారు. ఇకనైనా పవన్ కల్యాణ్ గురించి ఆలోచించడం మానేసి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని హితువు పలికారు. పోతుల సునీతకి పవన్ కల్యాణ్‌ను విమర్శించేంత స్థాయి, అర్హత లేదన్నారు. ప్యాకేజీ, పదవుల కోసం పార్టీలు మారే పోతుల సునీత రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీలో ఉంటుందో ప్రజలకి సమాధానం చెప్పాలన్నారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే వున్నాయన్న విషయాన్ని విశ్వ, సునీత గుర్తించాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగా శిక్షణ

శింగనమల : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగనవాడీ కార్యకర్తలకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు సులభంగా నార్మల్‌గా డెలివరీ అవ్వడం కోసం సులభమైన యోగా ఆసనాలను నేర్పిస్తారు. కార్యక్రమంలో సిడిపిఒ ఉమాశంకరమ్మ, యోగా మాస్టార్ నరేష్ , సూపర్‌వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, మధుమాల, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

'జగనన్న సురక్ష'పై అవగాహన

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో బుధవారం నోడల్ ఆఫీసర్ ఓబులమ్మ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్షణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను అందుబాటులో ఉన్నాయన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికీ వచ్చి అందులోని మీకు అవసరమైన సేవలను ఉచితంగా అందజేస్తారని గ్రామస్తులకు సూచించారు. ఆమె వెంట ఎంపిడిఒ యోగానందరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

ఈకెవైసి తప్పనిసరి

శింగనమల : రైతులు ఈ నెల 31వ తేదీ లోపు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని ఎఒ అన్వేష్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్, రబి సీజన్లలో పంట నమోదు చేయించి ఈకెవైసి చేసుకోని వారి జాబితా ఆర్‌బికెల్లో వ్యవసాయ సిబ్బంది వద్ద ఉందని తెలిపారు. ఈకెవైసి పూర్తయిన రైతులకు మాత్రమే జూలైలో పిఎం కిసాన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. వెస్ట్ నర్సాపురం, కల్లుమడి, ఆకులేడు, బండమీదపల్లి ఆర్‌బికెల్లో రైతులు ఈకెవైసి చేయించుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

బుక్కరాయసముద్రం: మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పాఠశాలలకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాలు సరఫరా చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర బుధవారం ఎంఈఒ-2 లింగయ్యనాయక్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా లింగయ్యనాయక్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ దేవేంద్రమ్మ, నాయకులు హేంద్రి మార్క్, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, శివప్రసాద్, వెంకటేశులు, దివాకర్‌రెడ్డి, లక్ష్మి, ఓబులేసు, సాధిక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని కలిసిన జెడిఎ

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా రైతులుకు అందిస్తున్న సేవలు గురించి ఎమ్మెల్యే కు ఆమె వివరించారు. జెడిఎ వెంట అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడీఏ ఎం.రవి, రాప్తాడు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్, సాంకేతిక వ్యవసాయ అధికారి వెంకటకుమార్, ఏఈవో హర్ష ఉన్నారు.